
**కథ**

# నల్ల చీర

**రాత్రి రెండు గంటలయింది. నిద్రపట్టక మంచం మీద అసహనంగా కదులుతున్నాను. బయట గూర్ఖా విజిల్ వినిపించింది. నిశ్శబ్ద నిశీధిలో గూర్ఖా విజిల్ భయం కలిగించింది. నెమ్మదిగా ఆ సౌండ్ దూరమవుతూ ఉంది. ఎప్పుడెప్పుడు తెల్లవారుతుందా అని చకోరపక్షిలా వేచి ఉన్నాను. రేపు నా చిరకాల వాంఛ నెరవేరబోతుంది. రేపు రాబోయే ఆ ఆనందాన్ని, ఆ మధుర క్షణాలను గుర్తు తెచ్చుకుంటుంటే నిద్ర రావడం లేదు.**



శ్యాం

నా ఆలోచనలు వెనక్కు వెళ్లాయి. అప్పుడు నాకు ఏడెనిమిది ఏళ్లు అనుకుంటా. బాబాయి దీపావళి సెలవులలో వస్తూ, నా కోసమని నలుపు గౌను తెచ్చాడు. నలుపు మీద చిన్న చిన్న పువ్వులతో చాలా బాగుంది. చిన్నప్పటి నుండి నాకు నలుపురంగంటే ఎంతో ఇష్టం.

ఆ దీపావళి రోజు నాకు బాగా గుర్తుండిపోయిన రోజు. ఆ రోజు కొత్త గౌను వేసుకొని మురిసిపోయాను. పూర్తిగా ఇంకా నా ముచ్చట తీరనే లేదు. ద్వారం దగ్గర కూర్చున్నాను. వెనుక నుండి ఎలా అంటుకుందో తెలియదు. గౌను కాలిపోతోంది. బాబాయి చూసి, వెంటనే నీళ్లు పోసి ఆర్పేశాడు. వీపు మీద అక్కడక్కడ కాలింది. సగం గౌను కాలిపోయింది. బాగా ఏడ్చాను. అందరూ నేను భయపడిపోయానని నన్ను ఓదార్చుతున్నారు. కానీ నాకు కాలిన గాయాల కంటే ఎంతో ఇష్టపడిన గౌను కాలినందుకే ఏడుపొచ్చింది.

నాయనమ్మ ఒకటే గోల. ''పండగపూట నల్ల బట్టలేంటి? నీకు ఇంకే రంగూ దొరకలేదురా'' అని బాబాయిని తిట్టింది.

''ఓసే లక్ష్మీ! ఇంకెప్పుడూ దానికి నల్లడ్రెస్సులు వేయకు. దానికి నలుపు రంగు అచ్చిరాలేదు. గుర్తుంచుకో'' అని అమ్మతో అంది.

''అయ్యో నా తల్లీ! దేవుడు రచ్చించాడమ్మా! లేకపోతే పిల్ల బుగ్గయిపోను'' నన్ను పట్టుకొని శోకాలు తీసింది. బాబాయి దోషిలా తలవంచుకున్నాడు.

కాలిపోయిన గౌనుని పండగ మామూలు అడగడానికి వచ్చిన చాకలి అప్పుడు తీసుకుపోయాడు. వాడు దాంతో వాడి కొడుక్కి డ్రాయర్లు కుట్టించాడు. అవి వేసుకొని ఆ పిల్లాడు తిరుగుతుంటే నా కళ్లలో నీళ్లు తిరిగేవి.

నలుపు బట్టలు వేసుకోవడం అదే నా మొదటి

మరియు ఆఖరుసారి. అప్పటి నుండి నలుపంటే ఇంకా ఎంతో ఇష్టమైపోయింది. మా వీధి టైలర్ దగ్గర పారేసిన కటింగ్ ముక్కల్లో నల్లరంగు ముక్కలు తెచ్చుకొని, బొమ్మలకి చుట్టి మురిసి పోయేదాన్ని. నేనెంత మారాం చేసినా అమ్మ ఎప్పుడూ నలుపురంగు బట్టలు కొనలేదు. ''నీకు అచ్చిరాలేదు. మర్చిపోయావా'' అని తిట్టేది.

పద్దెనిమిదేళ్లకే మంచి సంబంధమని పెళ్లి చేశారు. అమ్మయ్య, ఇప్పుడైనా నాకిష్టమైన రంగు బట్టలు వేసుకోవచ్చని ఎంతో ఆశపడ్డాను. కానీ, నా ఆశ అడియాశ అని అత్తారింటికి వచ్చిన రోజే తెలిసింది. ఆ ఇంట్లో నలుపంటే ఎవరికీ ఇష్టం ఉండదు. ముఖ్యంగా అత్తగారికి. ఆవిడకు నలుపంటే ఎంత అసహ్యమంటే లోదుస్తులు కూడా నలుపుని వాడకూడదు. చీరలకు కనీసం చిన్న నలుపు అంచుగానీ, బట్టలమీద, వస్తువుల మీద ఎక్కడా నలుపన్నది ఉండకూడదు. మొదటిలో సున్నితంగానైనా, నిష్కర్షగా చెప్పేసింది. ''ఇదిగో అమ్మాయి, ఈ ఇంట్లో నల్లబట్టలు కట్టుకోవడానికి వీల్లేదు. నీ పెట్టెలో అలాంటివి ఏమైనా ఉంటే మీ పుట్టింటికి పంపించేయ్'' అని.

నేను పది సంవత్సరాలుగా ఆ ఇంట్లో చూసిన నలుపు వస్తువులు నాలుగు మాత్రమే. ఒకటి తలుపు మూలన ఉండే మావయ్యగారి గొడుగు. వంటింట్లో ఇనుప కళాయి. అద్దం ముందు కాటుక డబ్బా. పాత కుట్టుమిషను. ఇంతకు మించి ఆ ఇంట్లో నలుపు వస్తువులే లేవు. అత్తారింట్లో నా కోరిక మనసులో అలా నిద్రాణమైపోయింది.

మావయ్యా, అత్తయ్య చనిపోయాక కుటుంబాలు వేరుపడ్డాయి. మా వారి ట్రాన్స్‌ఫర్‌తో మేము పిల్లలతో వేరేగా సిటీలోకి వచ్చేశాము. అన్నింటికి బయటకు వెళ్లి కొనుక్కోవాల్సిన పని నా వంతయింది. బయట ప్రపంచం చూడడంతో నాలో నిద్రాణమై ఉన్న కోరిక మళ్లీ మేల్కొంది. ఎవరు నల్లచీర కట్టుకొని కనిపించినా, ఆ చీర నాకైతే ఎలా ఉంటుందో అని ఊహించుకునే దాన్ని.

ఓ సారి మా వారితో కూడా నల్లచీర కొనమని చెప్పాను. దానికాయన ''వసూ! అమ్మ చెప్పేదిగా నలుపు అశుభమని'' అయిష్టంగా అన్నారు.

''మీరు ఇలాంటివి నమ్ముతారా'' అని నిలదీశాను.

''సర్లే చూద్దాం'' అని తప్పించుకున్నారు. అప్పటి నుండి అదిగో, ఇదిగో అంటూ ఇంకో రెండు సంవత్సరాలు గడిచిపోయాయి. ఇంక ఆయనకి కొనడం ఇష్టం లేదని తెలిసిపోయింది. కానీ, నిన్న సాయంత్రం కాయకూరలకి వెళ్లిన నా దృష్టి బజారులోని బట్టల షాపులో బైట వేలాడదీసిన నల్లచీరపై పడింది. నలుపు మీద చిన్న చిన్న సిమెంటు రంగు పువ్వులతో (నా మొదటి నల్లగౌను గుర్తుకు వచ్చింది) చాలా అందంగా ఉంది. ఇంక మనసాపుకోలేక షాపువాడిని దాని ధర అడిగాను.

''ఎంతో లేదమ్మా! రెండొందలే! పేక్ చెయ్యమంటారా!'' అన్నాడు.

''రేపొచ్చి తీసుకుంటాను. మరి రేటు కాస్త తగ్గించండి'' అన్నాను.

''సర్లేమ్మా మీరు ఎప్పుడూ వచ్చే కస్టమర్ కదా. నూట ఎనభైకి ఇస్తాను'' అన్నాడు.

నా ముఖం సంతోషంతో వెలిగిపోయింది. ''చీర ఎవరికీ అమ్మొద్దు. పేక్ చేసి ఉంచండి. రేపు ఉదయం వచ్చి తీసుకుంటాను'' అని చెప్పి ఊపిరి పీల్చుకున్నాను.

నా మీద నాకే ఆశ్చర్యం వేసింది. బహుశా నా జీవితంలో ఇదే నేను తీసుకున్న నా మొదటి సొంత నిర్ణయమేమో. ఇంటికి వెళ్లి డబ్బు సమకూర్చే పనిలో మునిగిపోయాను. నేను దాచుకున్నవి, ఆయన క్యాంప్‌కి వెళ్లినప్పుడు ఖర్చులకని ఇచ్చిన వాటిని కలిపి మొత్తం రెండు వందలయింది. అమ్మయ్య- చీర, జాకెట్టు తీసుకోవచ్చు అని అనుకున్నాను. ఎప్పుడెప్పుడు తెలవారుతుందా అని ఆత్రుతలో నిద్ర పట్టడం లేదు. అలా ఆలోచన్లతో తెల్లవారుజామున ఎప్పటికో నిద్రపట్టేసింది.

''మమ్మీ! మమ్మీ!'' శైలు పిలుపుతో మెలకువ వచ్చింది. ''సెవెన్ అవుతుంది మమ్మీ! ఇంకా లేవలేదు. ఒంట్లో బాలేదా!'' తల మీద చెయ్యి వేసి చూసింది. నా పదేళ్ల కూతురి మాటలకు ముచ్చటపడుతూ లేచాను.

''శైలూ! ఈ రోజు సెకండ్ సాటర్‌డే కదా! స్కూల్ సెలవు'' అవునన్నట్లు తలూపింది.

''తర్వాత పది గంటలకి తమ్ముడ్ని రాము వాళ్లింట్లో ఉంచి, మనిద్దరం బజారుకి పోదాం'' అన్నాను.

''ఎందుకు మమ్మీ'' ఆసక్తిగా అడిగింది.

''పని ఉందిరా'' అన్నాన్నేను.

''సాయంత్రం డాడీ కేంప్ నుండి వచ్చాక అందరం వెళదాం మమ్మీ'' అంది ఆరిందాలా.

''వద్దు, డాడీతో వద్దు. మనమే వెళదాం'' అని గబగబా ఇంటిపని, వంటపని ముగించి, పాపని తయారుచేసి, నేను తయారయ్యాను.

చిన్ననాటి కోరిక తీరబోతున్నదన్న ఉత్సాహం నా మొఖంలో, నా చేతల్లో కనిపిస్తోంది. బాబుని పక్కింట్లో ఉంచి, పాపని తీసుకొని బజారుకి వెళ్లాను. షాపు అల్లంత దూరంలో ఉండగా పాప సరిగ్గా నడవడం లేదు. నాకైతే, నేను దాన్ని ఈడ్చుకొని వెళుతున్నట్లుగా అనిపించింది. ఏమై ఉంటుందా అని పాప వైపు చూశాను. అది వెనక్కి చూస్తోంది.

''ఏమైందమ్మా!'' అని అడిగితే..

''మమ్మీ ఆ షాపులో చూడు'' అంది. అది చూపిన వైపు చూశాను. అది రెడీమేడ్ బట్టల షాపు.

''ఆ బ్లాక్ ఫ్రాక్ చూడు మమ్మీ ఎంత బాగుందో'' అనేసరికి, ఉలిక్కిపడ్డాను.

నిజమే నలుపుమీద తెల్లని చుక్కలు, తెల్లని లేసుతో చాలా అందంగా ఉంది. పాప అటువైపే కళ్లార్పకుండా చూస్తోంది. ''పద పద'' అని చెయ్యి పట్టి లాగబోయాను.

''మమ్మీ! ప్లీజ్ మమ్మీ! ఆ ఫ్రాక్ తీసుకోవా'' అంది.

''డాడీ, కేంప్ నుండి వచ్చేటప్పుడు తెస్తామన్నారు కదా'' అసహనంగా అన్నాను.

''కానీ, డాడీ బ్లాక్ ఫ్రాక్ తీసుకురారు కదా మమ్మీ! నాకు బ్లాక్ అంటే చాలా ఇష్టం. డాడీకి బ్లాక్ అంటే ఇష్టం ఉండదు. మా ఫ్రెండ్స్ అందరి దగ్గరా బ్లాక్ డ్రెస్‌లున్నాయి. నా దగ్గరే లేదు'' విచారంగా అంది.

నిజమే ఆ ఫ్రాక్ చాలా బాగుంది. కానీ, దానికి కూడా నలుపంటే అంత ఇష్టమని ఇప్పుడే తెలిసింది. కొన్ని క్షణాలు ఏం చెయ్యాలా అని సందిగ్ధంలో పడ్డాను. వెంటనే ఒక నిశ్చయానికి వచ్చి, పద అని శైలూని తీసుకొని రెడీమేడ్ షాపులోకి వెళ్లాను. అది సంతోషపడిపోయింది. ఫ్రాక్ బేరమాడి చివరకు రెండు వందలకే తీసుకున్నాను. శైలు ముఖం ఆనందంతో వెలిగిపోయింది.

నా పాపలో మళ్లీ నా బాల్యం వచ్చినట్లనిపించింది.

